సాక్షి
పెద్దపల్లి
గురువారం ; 9 ; ఫిబ్రవరి ; 2023



ఉద్యోగాలు వద్దట..!

విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుదిద్ది ఉద్యోగాలు సాధించే దిశగా తయారు చేయాలని ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ని రూపొందించింది. 8లో▸



పత్తి క్వింటాల్‌కు రూ.7,532

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు బుధవారం రూ.7,532 పలికింది. కనిష్టంగా రూ.6,800, నగటున రూ.7,465గా నమోదైనట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.0/16.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికం అవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



పోతారం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

రామగిరి(మంథని): రామగిరి, ముత్తారం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను డీఈవో మాధవి బుధవారం పరిశీలించారు. సెంటినరీకాలనీలోని కేజీబీవీలో సౌకర్యాలపై ఆరా తీశారు. పన్నూరులో కేజీబీవీ భవన నిర్మాణ పనులు తెలుసుకున్నారు. రత్నాపూర్ యూపీఎస్, నాగేపల్లి పాఠశాలల్లో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న నిర్మాణ, మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యాబోధన, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం వంటలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముత్తారం మండలం మచ్చుపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరుశాతాన్ని పరిశీలించారు. పోతారం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులో మాట్లాడారు. ప్రతిఒక్కరూ 10జీపీఏతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ జక్కం శ్రీనివాస్, హెచ్‌ఎంలు రాజ్‌కుమార్, వేగోళపు సదానందం, లక్ష్మీనారాయణ, ఎస్‌వో మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు



రైతులను సన్మానిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

కమాన్‌పూర్(మంథని): రైతులు తక్కువ పెట్టుబడితో సాగయ్యే ఆయిల్ పాం వైపు దృష్టి సారించాలని డీఏవో ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్ అన్నారు. మండలంలోని పెంచికల్‌పేటలో బుధవారం ఆయిల్ పాం సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. డీఏవో మాట్లాడుతూ ఆయిల్ పాం సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, అందులో సరుగుడు, నీలగిరి, ఆస్ట్రేలియా టేకు వంటివి పెంచుకుని అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. సర్పంచ్ కొండ వెంకటేశ్, ఉపసర్పంచ్ లింగాల కుమార్, తిరుమల ఆయిల్ పాం సీఈవో కేశ్‌కళ్యాణ్, ఏవో బండి ప్రమోద్ కుమార్, ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్, ఆజ్మీర సురేశ్, రైతులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' అందుకోండి



కంటివెలుగుపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

పెద్దపల్లిరూరల్: కంటిచూపు బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందరికీ కంటి పరీక్షలు చేయిస్తోందని, 18 ఏళ్లపైబడిన వారంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎనిమిదో వార్డులో చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం సందర్శించారు. అవసరమున్న వారికి మందులు, కళ్లద్దాలు అందిస్తున్నామని, ప్రత్యేక అవసరాలు ఉన్నట్లు తేలితే ఆర్డర్‌పై అద్దాలు తెప్పించి ఇస్తామన్నారు. అవసరమైతే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. కంటివెలుగు ప్రోగ్రాం అధికారి డాక్టర్ మహేందర్, హెచ్‌ఈఓ రాజేశం, ఫర్హా మక్సూన్, ఎలిజబెత్‌రాణి, సనయన తదితర సిబ్బంది ఉన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ఎంపీని సన్మానిస్తున్న వివేక్ పటేల్

సుల్తానాబాద్: బీసీలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వానికి సూచించారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాకు జిల్లా నుంచి పలువురు తరలివెళ్లి సంఘీభావం ప్రకటించారు. బీసీ గణన చేపట్టాలని, క్రిమీలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను సన్మానించారు. బీసీ సంఘం జాతీయ నాయకులు ఆకుల స్వామివివేక్ పటేల్, సీనియర్ నాయకులు కట్ట నరేంద్రచారి, జిల్లా గౌరవ అధ్యక్షుడు దాసరి హనుమయ్య, అధ్యక్షుడు తాడూరి శ్రీమన్, మేడగొని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

రాజన్నకు 50 కోట్లు.. అంజన్నకు 100 కోట్లు..

బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని రెండు ప్రధాన ఆలయాలకు నిధుల కేటాయింపు

కొండగట్టుకు మాస్టర్‌ప్లాన్..

→ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు మంజూరు చేశారు. గత డిసెంబరు 7న జగిత్యాల సభలో స్వామివారికి రూ.100 కోట్లు ఇస్తామన్న సీఎం.. సరిగ్గా 50 రోజులకు తన మాట నిలబెట్టుకున్నారు. రానున్న 50 ఏళ్లలో భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాల్సి ఉందని, ప్రత్యేక ప్రణాళికతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు.



కొండగట్టు- వేములవాడ ఆలయాలు

- నాంపల్లి గుట్టపై త్వరలో రోప్‌వే ఏర్పాటు
- కోటిలింగాల, గోదావరిఖని, ఎల్‌ఎండీలలో మరిన్ని పనులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలోని కొండగట్టు అంజన్న, వేములవాడ రాజన్న ఆలయాలకు బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం దక్కినట్లయ్యింది. మొన్న రాజన్న ఆలయానికి రూ.50 కోట్లు కేటాయించిన సర్కారు.. తాజాగా కొండగట్టుకు రూ.100 కోట్లు ప్రకటించింది. దీంతో ఆలయాల అభివృద్ధికి ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్న ఘడియలు వచ్చినట్లయ్యింది.

ఎములాడ జంక్షన్ల సుందరీకరణ..

రాజన్న గుడి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ 18 జూన్ 2015న స్వయంగా గుడి, పట్టణం కలియ తిరిగారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఇందుకు ఏటా రూ.100 కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని ప్రకటించారు.

→ ముందుగా రూ.71 కోట్లు మంజూరు చేశారు. అనంతరం వీటీడీఏ ఏర్పాటు చేసి కమిటీనీ ప్రకటించారు. చైర్మన్‌గా సీఎం కేసీఆర్, వైస్ చైర్మన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పురుషోత్తంరెడ్డిని నియమించారు. నిధులను వీటీడీఏ ద్వారానే ఖర్చు చేయాలని జీవో విడుదల చేశారు.

→ ఆ మేరకు ఆలయ అధికారులు రూ.410 కోట్లతో భక్తుల సౌకర్యాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. గతేడాది, ఈసారి బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున కేటాయించారు.

→ తాజా నిధులతో బద్దిపోచమ్మ గుడి వద్ద సేకరించిన భూమికి ప్రహరీ, బోనాల మంటపం నిర్మిస్తామని వీటీడీఏ వైస్ చైర్మన్ వెల్లడించారు. నగరమంతా ఫుట్‌పాత్‌ల నిర్మాణం, గుడి ట్యాంక్‌బండ్‌పై వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ పనులు చేపడతామని, నందికమాన్ నుంచి వేములవాడకు చేరుకునే రోడ్డు సుందరీకరణ, జంక్షన్లు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

నాంపల్లి గుట్టకు రోప్‌వే

→ వేములవాడను తీర్చిదిద్దే క్రమంలో మంత్రి కేటీఆర్ సూచనల మేరకు నాంపల్లి గుట్టపై రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం జరగనుంది. వేములవాడకు వచ్చే కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వేట్రాక్ నాంపల్లి గుట్టను ఆనుకుంటూ వెళ్లనుంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్, గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల నుంచి వచ్చే భక్తులకు ఆహ్లాదకరంగా ఉండేలా ఇక్కడి పరిసరాలను తీర్చిదిద్దనున్నారు. ఈ పనులపై కేటీఆర్ ఇప్పటికే సమీక్షించారు కూడా.



నాంపల్లి గుట్టపై ప్రతిపాదిత కేబుల్ కారు

కాళేశ్వరం టూరిజం సర్క్యూట్

→ రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక కాళేశ్వరం.. దాని అనుబంధ ప్రాజెక్టుల వద్ద పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ పేరిట బడ్జెట్‌లో రూ.750 కోట్లు కేటాయించింది. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, గోదావరిఖని వంతెన, కోటిలింగాల బ్యాక్ వాటర్, లోయర్, మధ్య, ఎగువ మానేరు డ్యామ్‌ల వద్ద పర్యాటక అభివృద్ధికి ఈ నిధులు వెచ్చించనున్నారు. అయితే ఉమ్మడి జిల్లాను పర్యాటక క్షేత్రంగా మలచాలన్న ప్రభుత్వ లక్ష్యం ఎప్పటిలోగా నెరవేరుతుందోనన్న విషయం ఆసక్తికరంగా మారింది.



రామగుండం సీపీకి డీఐజీగా పదోన్నతి



రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం సీపీ రెమా రాజేశ్వరికి డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ పోలీస్(డీఐజీ)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పదోన్నతితో ఆమె ఇక్కడ సీపీగానే కొనసాగనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మైనార్టీ రుణాల దరఖాస్తులు పరిశీలన



దరఖాస్తుల పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

కోల్‌సిటీ: మైనార్టీ రుణాలకు దరఖాస్తు లబ్ధిదారుల దరఖాస్తులను రామగుండం కార్పొరేషన్ ఆవరణలో అధికారులు బుధవారం పరిశీలించారు. కేటగిరీ–1లో 15 యూనిట్లు, కేటగిరీ–2లో 8 యూనిట్ల చొప్పున 23 యూనిట్లను కార్పొరేషన్‌కు కేటాయించారు. ఈ 23 యూనిట్లకు 1267 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజు దరఖాస్తుల పరిశీలనకు 380 మంది హాజరయ్యారు. నిర్వహణను మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, ఆర్‌ఓ రాయలింగు పర్యవేక్షించగా.. డీఎంసీ రజినితోపాటు ఇన్‌చార్జి టీఎంసీ శ్వేత, సీఓలు నిర్వహించారు.

మల్లన్న కోవెల.. అభివృద్ధి కళకళ..!

- దాతల సహకారంతో పనులు పూర్తి
- మధనపోశమ్మ, బంగారు పోశమ్మ ఆలయాలు పూర్తి
- భక్తులకు అందుబాటులోకి రానున్న బ్రహ్మపుష్కరిణి
- నేడు ప్రారంభించనున్న మంత్రి ఈశ్వర్



ప్రారంభానికి సిద్ధమైన కోనేరు (బ్రహ్మ పుష్కరిణి)

ఓదెల: మండలకేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఆలయ ఆవరణలో దాతల సహకారంతో ప్రారంభించిన మధన పోశమ్మ, బంగారు పోశమ్మ ఆలయాలతోపాటు.. బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) పనులు పూర్తయ్యాయి. వీటిని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తోపాటు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు.

దాతలు వీరే..

శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని నిర్మించగా.. ఓదెలకు చెందిన ఆకినపల్లి ప్రభావతి, భగవంతయ్య విగ్రహాలను బహూకరించారు. అలాగే బంగారు పోశమ్మను స్కందకాశీ మంజుల, గంగాధర్ దంపతులు, స్వామివారి పాదాలతోపాటు సప్తమాతృకా విగ్రహాలను అరుకాల సుజాత, నారాయణ దంపతులు, మధనపోశమ్మ విగ్రహాన్ని కాంపెల్లి రమాదేవి, రమేశ్ దంపతులు బహూకరించారు.



ముస్తాబైన మధనపోశమ్మ ఆలయం



బంగారుపోశమ్మ ఆలయం

15 నుంచి బ్రహ్మోత్సవాలు

మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15న ప్రారంభం కానున్నాయి. జూలై 9న జరిగే పెద్దపట్నం మహోత్సవంతో జాతర ముగియనుంది. స్వామివారిని ప్రతి ఆదివారం, బుధవారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటున్నారు. స్వామివారికి బోనాలు చేసి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. అలాగే ఒగ్గుపూజారులతో పట్నాలు వేయిస్తుంటారు.

నేడు మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో 'సాక్షి' ఫోన్‌ఇన్



మంథని: మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పుట్ట శైలజ ఎన్నికై మూడేళ్లు పూర్తవుతోంది. ఈ క్రమంలో మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి.. నెలకొన్న సమస్యలపై ఆమె మాట్లాడేందుకు 'సాక్షి' 'ఫోన్‌ఇన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తోంది. ప్రజలు తమ సూచనలు, సలహాలు, సమస్యలపై ఆమెతో నేరుగా మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది.

సాక్షి ఫోన్ ఇన్

సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
సెల్ నంబర్: 99595 76738

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్



రాజ్‌ఠాగూర్‌కు తిలకం దిద్దుతున్న వృద్ధురాలు

గోదావరిఖని: కాంగ్రెస్‌తోనే రామగుండం అభివృద్ధి సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో భాగంగా బుధవారం 27, 41వ డివిజన్లలో పర్యటించారు. గడపగడపకూ పర్యటిస్తూ.. కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ఎండగట్టారు. కేంద్రం దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతోందని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. బడ్జెట్‌లో ప్రజలు, రైతులు, నిరుద్యోగ యువతకు పెద్దగా ప్రయోజనం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, ఎండీ.ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, గాదం విజయానందర్, ఫజల్‌బేగ్, కల్వల రంజిత్, మారెల్లి రాజిరెడ్డి, బొమ్మక రాజేశ్, గట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

కరీంనగర్: మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం ఖుస్రోషాఖాన్ తెలిపారు. ఈనెల 17,18,19 తేదీల్లో కరీంనగర్ నుంచి 80 బస్సులు, కోరుట్ల నుంచి 60, మెట్‌పల్లి నుంచి 60, జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి 42, కొండగట్టు/జగిత్యాల నుంచి 37, సిరిసిల్ల నుంచి 11, వరంగల్–హుజూరాబాద్ నుంచి 45 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. వేములవాడ బస్టాండ్ నుంచి గుడి వరకు 14 మినీ బస్సులలో ఉచిత రవాణా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

- వేలాల జాతరకు గోదావరిఖని, మంథని డిపోల నుంచి, కాళేశ్వరానికి మంథని, కరీంనగర్, గోదావరిఖని డిపోల నుంచి రద్దీని బట్టి బస్సులు నడుపుతామని తెలిపారు. జగిత్యాలలోని దుబ్బరాజన్న, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి జాతరకు, మంథని నుంచి సిరొంచకు ఆరు బస్సులు భక్తుల రద్దీని బట్టి నడుపుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆర్మూర్, నర్సంపేట, వరంగల్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి నుంచి కూడా వేములవాడ దేవస్థానానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు తెలిపారు.

కుష్టుపై అవగాహన ఉండాలి

జూలపల్లి: కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలని కుష్టు వ్యాధి నివారణ (డీపీఎంవో) అధికారి ప్రకాశ్‌రావు సూచించారు. జనవరి 30 నుంచి ఈనెల 13 వరకు నిర్వహిస్తున్న స్పర్శ్ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పెద్దాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే మందులు క్రమం తప్పకుండా వాడితే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఏఎన్‌ఎం రుక్మిణి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.







కమనీయం.. శ్రీవేంకటేశ్వరుని కల్యాణం

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్ ఆవరణలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాష్యం రంగాచార్యుల ఆధ్వర్యంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, కౌన్సిలర్లు మాధవి, చంద్రశేఖర్, పెద్దపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూర్, రంగంపల్లి గ్రామాల నుంచి భక్తులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు.

క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీవాణి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరస్పాండెంట్ శశాంక

సుల్తానాబాద్: శాతవాహన యూనివర్సిటీ విడుదలచేసిన డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాల్లో సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ శశాంక తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులను అభినందించి, డిక్షనరీలు బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శశాంక, కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అడిచర్ల శ్రీనివాస్ విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం



కార్తీకేయ

పెద్దపల్లిరూరల్: మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన కార్తీకేయ 7వ తరగతి విద్యార్థి అదృశ్యమైనట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. ఇంటి నుంచి పాఠశాలకు వెళతానని బయల్దేరి తిరిగి ఇంటికి రాలేదంటూ విద్యార్థి తండ్రి మురుగాని రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట ముగ్గురు బైండోవర్



రామగిరి(మంథని): మండలంలోని బేగంపేట, చందనాపూర్ గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తున్న రాచకొండ లక్ష్మణ్, సాగర్, ఊదరి సత్తమ్మపై కేసు నమోదు చేసి బుధవారం రామగిరి తహసీల్దార్ రాంమోహన్ ఎదుట బైండోవర్ చేసినట్లు మంథని ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. బేగంపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్, సాగర్ గుడుంబా తయారుచేసి విక్రయిస్తున్నారని అందిన సమాచారంతో వారి ఇళ్లలో సోదాలు చేసి 5 లీటర్ల గుడుంబా, 40 కిలోల స్పటిక, 10 కిలోల బెల్లం, సత్తమ్మ ఇంట్లో 4 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. గతంలో లక్ష్మణ్ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని అయినప్పటికీ మరోసారి గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. దీంతో అతనిపై బైండోవర్ ఉల్లంఘన కేసు నమోదు చేశామని రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందని లేనిపక్షంలో ఏడాది జైలుశిక్ష పడుతుందని సీఐ వివరించారు. ఎక్సైజ్ అధికారులు సోదాలు చేస్తుండగా వారి విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన లక్ష్మణ్‌పై రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టూక్యా, కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విజయ్‌కుమార్, పెద్దపల్లి స్పెషల్ స్క్వాడ్ సీఐ రాథోడ్, ఎస్సై సాయిరాం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలు వద్దట..!

'ఇటీవల హైదరాబాద్‌కు చెందిన ఓ కెమికల్ కంపెనీ విద్యార్థులకు రూ.16వేల జీతంతో ఉద్యోగాలు ప్రకటించగా.. కరీంనగర్‌కు చెందిన విద్యార్థులకు టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారమందించారు. ఇందులో చాలా మంది ఇంటర్వ్యూలకు హాజరవగా నలుగురు కూడా రిపోర్టు చేయలేదు. డిగ్రీ పూర్తి చేసిన వారికి రూ.16 వేల జీతమిచ్చినా ఉద్యోగాల్లో చేరడం లేదు.'

'ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఓ విద్యార్థినికి ఒక కంపెనీల్లో ఉద్యోగం వచ్చింది. ఇంటర్వ్యూకు పంపించిన తల్లిదండ్రులు వివిధ కారణాలు చెప్పి ఉద్యోగానికి పంపించలేదు. దీంతో కంపెనీవారు సదరు ఉద్యోగం వేరే వారికి కేటాయించారు. అయితే ఇన్ని రోజులు స్కిల్స్ నేర్చుకొని ఉద్యోగం సాధించిన విద్యార్థిని ఇంటివద్దే ఉండిపోయింది. ఇలాగే చాలా మంది ఏళ్ల తరబడి శిక్షణ పొంది పలు ఇంటర్వ్యూలకు హాజరవడం లేదు. మరికొందరు ఉద్యోగం వచ్చినా వెళ్లడం లేదు'.



టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

- నైపుణ్యాల మెరుగు దిద్దుతున్న టాస్క్
- శిక్షణ వరకే పరిమితమవుతున్న విద్యార్థులు
- ఉద్యోగాల ఇంటర్వ్యూలపై అనాసక్తి
- తల్లిదండ్రులు పంపకపోవడమే ప్రధాన కారణం
- వేతనాలు చాలవని మరికొందరి వెనకంజ
- ప్రభుత్వ తపన వృథా అంటున్న నిపుణులు
- కొలువులతోనే బంగారు భవిత అంటున్న వైనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టాస్క్‌లో నమోదైన కళాశాలల వివరాలు

జిల్లా	ఇంజనీరింగ్	డిగ్రీ	డిగ్రీ, పీజీ	డిప్లామా	మొత్తం
కరీంనగర్	7	11	8	3	29
పెద్దపల్లి	3	4	5	1	13
రాజన్నసిరిసిల్ల	1	3	1	1	6
జగిత్యాల	1	7	5	1	14
మొత్తం	12	25	19	6	62

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుదిద్ది ఉద్యోగాలు సాధించే దిశగా తయారు చేయాలని ప్రభుత్వం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)ని రూపొందించింది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్‌తో పాటు వివిధ కోర్సుల విద్యార్థులను, కళాశాలలను టాస్క్‌లో నమోదు చేయించి ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నమోదైన ప్రతీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. కాగా శిక్షణ తీసుకున్న విద్యార్థులు అందివచ్చిన ఉద్యోగ అవకాశాలను వదులుకుంటున్నారు. దీనికి ప్రధాన కారణం తల్లిదండ్రుల అనాసక్తి అని తెలుస్తోంది.

ఉద్యోగాలపై అనాసక్తి...

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 62 కళాశాలలు టాస్క్‌లో నమోదు చేసుకున్నాయి. వీటిలో గతేడాది దాదాపు 2 లక్షల మంది నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు 4,300 మంది నమోదు చేసుకున్నారు. టాస్క్ ప్రతినిధులు విడతల వారీగా కమ్యూనికేషనల్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, రెజ్యూమ్ సెట్టింగ్, ప్రజెంటేషన్ స్కిల్స్, అపిటిట్యూడ్, టీం వర్క్, గ్రూప్ డిస్కషన్, ప్రోగ్రామింగ్ టెక్నిక్స్‌తో పాటు విద్యార్థుల కోర్సులను బట్టి అవసరమయ్యే వివిధ రకాల నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. కంపెనీలకు, విద్యార్థులకు అనుసంధానం చేస్తూ కార్పొరేట్ కంపెనీలు కోరుకునే స్కిల్స్‌లో పటిష్టంగా శిక్షణ ఇస్తున్నారు. కానీ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్వ్యూల వరకు వెళ్లడం లేదు. టాస్క్ ప్రతినిధులు, కళాశాలల వారు సమాచారం అందించినా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇందులో ముఖ్యంగా డిగ్రీ విద్యార్థులు ఎక్కువగా ఉంటున్నట్లు సమాచారం. జీతభత్యాలు లెక్కించి ఏమీ మిగలవని చెప్పి తల్లిదండ్రులే ఇంటి వద్దే ఆపేస్తుండగా, డిగ్రీతోనే లక్షల ప్యాకేజీ ఊహించుకున్న విద్యార్థులు కంపెనీలు అందిస్తున్న అవకాశాలను వదులుకుంటున్నారు.

ఉద్యోగాల్లో చేరితేనే ఉజ్వల భవిష్యత్తు



టాస్క్‌లో నమోదైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగాలకు కావాల్సిన మెలకువలు నేర్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఇంటర్వ్యూలకు దూరం కాగా మరికొందరు ఉద్యోగాల్లో ఎంపికైనా జాయిన్ కావడం లేదు. తల్లిదండ్రులు పంపించకపోవడమూ ఒక కారణమే. డిగ్రీ తర్వాత వేతనాలు మొదట్లో కొన్ని సంస్థల్లో తక్కువగా ఉండి తర్వాత పెరుగుతాయి. ఉద్యోగం చేస్తూ పోతే అనుభవం పెరిగిన కొద్ది వేతనాలు పెంచుతారు. ఉద్యోగం చేస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. – గంగాప్రసాద్, టాస్క్ రీజనల్ కోఆర్డినేటర్

లక్షల్లో ప్యాకేజీలని ఊహలు

డిగ్రీ, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు కంపెనీలు ప్రస్తుతం ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇందులో భాగంగా కంపెనీలు మొదట్లో తక్కువ వేతనాలు ప్రకటిస్తుండగా, జీతాలు రూ.లక్షల్లో ఊహించుకుంటున్న విద్యార్థులు అటువైపు వెళ్లడంలేదు. పోటీ పడి స్కిల్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంపై ఆసక్తి చూపడం లేదు. తద్వారా రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న శిక్షణ బూడిదలో పోసిన పన్నీరే అవుతుందని విద్యారంగ నిపుణులు భావిస్తున్నారు. యువతరానికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా కల్పించాలనే ప్రభుత్వ తపన వృథా అవుతుందని బాధపడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు వారి పంతా మార్చుకొని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు.

సీ-2 క్వార్టర్లలోని సమస్యలు పరిష్కరించాలి



జీఎం వెంకటేశ్వర రావుకు వినతి పత్రం అందిస్తున్న కాలనీ వాసులు

రామగిరి(మంథని) మండలంలోని సెంటినరీకాలనీ సీ–2 క్వార్టర్లలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఏరియా మాజీ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్జీ3 జీఎం వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించి మాట్లాడారు. క్వార్టర్ల చుట్టూ గతంలో నిర్మించిన ప్రహరీకి మరమ్మతులు చేపట్టాలని కోరారు. చెడిపోయిన ఫెన్సింగ్‌ను తొలగించి కొత్తగా ఫెన్సింగ్ వేయించాలని, క్వార్టర్ల చుట్టూ ముళ్లపొదలను తొలగించి లైటింగ్ మెరుగుపర్చాలని కోరారు. మెయిన్ డ్రెయినేజీ సంప్ నిండి మురుగునీళ్లు క్వార్టర్లలోకి వస్తుండడంతో దుర్గంధం వెలువడుతోందని దీంతో దోమలు వృద్ధిచెందుతున్నాయని వివరించారు. ఈమేరకు జీఎం వెంకటేశ్వర రావు స్పందించి కాలనీలోని సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తరపున కృషిచేస్తానని హామీఇచ్చినట్లు పేర్కొన్నారు.

సింగరేణి క్వార్టర్స్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు

రామగిరి(మంథని): మండలంలోని సెంటినరీకాలనీ సింగరేణి టీ2 క్వార్టర్స్‌లో బుధవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై కటికె రవిప్రసాద్ తెలిపారు. ఇటీవల ఎస్సై రవి ప్రసాద్ సీసీ కెమెరాల పనితీరు, వాటి ప్రాముఖ్యతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు సహకరించిన స్థానికులను ఎస్సై అభినందించారు.

పాలకుర్తిలో మట్టి మాఫియా హల్‌చల్

- అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై ఎదురుదాడి
- మట్టి తరలిస్తున్న లారీ సీజ్



బసంత్‌నగర్ విమానాశ్రయ స్థలంలో మట్టి తరలింపు ప్రదేశం

పాలకుర్తి: మండలపరిధిలో మట్టిమాఫియా ఆగడాలు శృతిమించుతున్నాయి. మండల రెవెన్యూ కార్యాలయానికి అతి సమీపంలో బసంత్‌నగర్ విమానశ్రయం ప్రతిపాదిత స్థలం నుంచి రాత్రిళ్లు కొందరు అక్రమంగా లారీల్లో ఎర్రమట్టిని పెద్దపల్లితో పాటు సమీప గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్నిరోజులుగా మట్టిదందా మూడు ట్రాక్టర్లు ఆరు లారీలుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో స్పందించిన తహసీల్దార్ సునీత ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భానుకుమార్ సిబ్బందితో కలిసి రాత్రి మట్టిని తరలించే ప్రదేశానికి వెళ్లారు. అయితే అధికారులను చూసిన అక్రమార్కులు తమ వాహనాలను వదిలి పారిపోయారు. దాదాపు రెండుగంటలు వేచిచూసినా ఎవరూ రాకపోవడంతో అప్పటికే లోడ్ చేసిన లారీని సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మిగతా ఐదు లారీల వివరాలు నమోదు చేసి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

అధికారులపై ఎదురుదాడి...

అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో ఘటనా స్థలానికి వెళ్లిన అధికారులపై మట్టి మాఫియా సభ్యులు హల్‌చల్ చేశారు. రాత్రి సమయం కావడంతో రెవెన్యూ అధికారులు రక్షణ కోసం బసంత్‌నగర్ పోలీస్ సిబ్బందిని వెంట తీసుకెళ్లారు. మట్టితరలింపును అడ్డుకుని వాహనాలను సీజ్ చేసేందుకు యత్నించగా వారు అధికారులపై ఎదురు తిరిగి హంగామా సృష్టించారు. విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్‌ను బూతులు తిడుతూ అడ్డుకునేందుకు యత్నించారు. మద్యంతాగిన వారిని చూసి ఒకదశలో అధికారులు తీవ్ర భయాందోళన గురయ్యారు. చివరకు సమాచారం అందుకున్న బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. అధికారులను బూతులు తిడుతూ వారి విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'శ్రీచైతన్య' సత్తా



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ మూడో, ఐదోసెమిస్టర్ ఫలితాల్లో శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు సత్తా చాటారు. బీఎస్సీ విభాగంలో ఎం.ప్రణయ 9.2, సయ్యద్ సారా 9.2, ఎల్.అఖిల 9.1, ఎస్.పవిత్ర 9.1, కే.సాత్విక 9.1, వి.అంజలి 9.0, బిందు శ్రీ 9.0, వై.దీపిక 9.0, ఏ.రశ్మిత 9.0.. బీకాం, మేనేజ్మెంట్ విభాగంలో బి.రాహుల్ 9.2, కే.సౌమ్య 9.1, బిందు శ్రీ 9.0 జీపీఏ సాధించారని, చాలామంది విద్యార్థులు 8.5 జీపీఏకు పైగా సాధించి యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్.ఎల్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ ఫలితాల్లో వాణినికేతన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ దీపిక

శాతవాహనయూనివర్సిటీ: శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో వాణినికేతన్ డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చినట్లు శాతవాహన ఈసీ మెంబర్, కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక తెలిపారు. టి.నవ్య 9.08, సుహానా 8.78, డి.శ్రావణి 8.68, డి.సౌమ్యమిశ్రా 8.6, జె.దర్శిని8.57, కామర్స్ విభాగంలో కే.పూజిత 8.65, ఎం.శ్రావణి 8.63, ఏ.ఉమాదేవి 8.52, ఆర్ట్స్ విభాగంలో నందుకుమార్ 8.5 జీపీఏ సాధించారు. ఎం.వైష్ణవి 9.14 ,టి.శిల్ప 8.89, ఈ.అర్చన 8.7, ఏ.హర్షిని 8.44, ఎం.మెహసిన్ అహ్మద్ 8.34, అభిలాష్ 8.27, ఐ.అనూష 8.13,ఆర్ట్స్ విభాగంలో కె.మౌనవ్య 9.58, డి.శ్రీవర్ష 8.86, ఈ.శివాని 8.2 ఎస్‌జీపీఏ సాధించారు. 146 మంది 8.0ఆపైన అధిక ఎస్‌జీపీఏలు యూనివర్సిటీస్థాయిలో సాధించారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం కళాశాల కరస్పాండెంట్ ఐ.దీపిక, ప్రిన్సిపల్ డి.వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.

వరిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్

రామగిరి: ముత్తారంలోని రైతు వేదికలో బుధవారం రామగిరిఖిలా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు వరి సాగులో సస్యరక్షణ చర్యలపై కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ అవగాహన కల్పించారు. శ్రీకొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హార్టికల్చర్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గ్రామీణ ఉద్యాన పని అనుభవం కార్యక్రమంలో భాగంగా సదస్సు ఏర్పాటు చేశారు. హార్టికల్చర్ విద్యార్థులు 8 మందిని ముత్తారం , దరియాపూర్‌లో నాలుగునెలలపాటు అనుభవ కార్యక్రమం క్రింద రైతులకు అనుసంధానం చేశామని, వారు గ్రామాల్లోని సమస్యలు, పంట స్థితిగతులు, చీడపీడలు, వనరులపై తెలుసుకుని తగిన సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త వెంకన్న వరిలో కాండం తొలుచు పురుగు జీవిత చక్రం, వివిధ పంటదశలలో కలగజేసే నష్టాన్ని రైతులకు వివరించారు. మృత్తిక శాస్త్రవేత్త కిరణ్ మాట్లాడుతూ వరిలో జింక్ లోపంపై వివరించారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సర్పంచ్ రజిత, మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలేఖ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ
- అన్నదాతల పంటలకు సాగుకు అసౌకర్యం



ఎక్లాస్‌పూర్‌లో దొంగలు కొల్లగొట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మంథని: నియోజకవర్గంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లతో పాటు పంటపొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగివైరు దొంగిలిస్తున్నారు. మంగళవారం రాత్రి మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణాలు, గ్రామాల్లో సీసీ కెమెరాల నిఘా, పోలీసుల భద్రత కొనసాగుతున్నా చోరీలు మాత్రం ఆగడం లేదు. ఇళ్లల్లో చొరబడి బంగారు ఆభరణాలు, పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కొల్లగొడుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఎక్లాస్‌పూర్‌లో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లారు. గ్రామంలోని నాంపల్లి రాజయ్యకు చెందిన 25 కేవీ, గందం రవి, బొడ్డు సదానందంకు చెందిన 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో రాగివైరు దొంగిలించారు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను వారం క్రితం చోరీచేశారు.

పంటల సాగుకు అంతరాయం...

ఒక్కో రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఐదుగురు రైతులు పంటలు సాగుచేసుకుంటున్నారు. దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను కొల్లగొడుతుండడంతో రైతులు వేసిన పంటలకు నష్టం వాటిల్లుతోంది. మంథని ప్రాంతం టెలెండ్ ప్రాంతం కావడంతో విద్యుత్ మోటార్ల కిందనే ఎక్కువ పంటలు సాగుచేస్తారు. పెద్దమొత్తంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండడంతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌లోని విలువైన రాగివైరును ఎత్తుకెళ్లి వాటినికి అక్కరకు రాకుండా చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రైతులకు చేరాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. పైగా రైతులకు భారం అవుతోంది. ఇటీవలికాలంలో దొంగలు రెచ్చిపోతున్నా వారిని కట్టడి చేసే విషయంలో పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిరుద్యోగ యువత ఉపాధే లక్ష్యంగా ముందుకు

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ



వీరారెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న జీఎం

గోదావరిఖని: సింగరేణి పరిసర గ్రామాల యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో వోల్వోడంప్‌ట్రక్ ఆపరేటర్ శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. స్వయం ఉపాధి కల్పనలో భాగంగా నిరుద్యోగ యువతకు ఓపెన్‌కాస్ట్‌లో ప్రైవేట్ ఓబీలో పనిచేసేందుకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హెవీడ్రైవింగ్ లైసెన్స్ అర్హతగల నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించేందుకు ఈశిక్షణ ఇస్తున్నామన్నారు. టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్ (టీటీసీ) ద్వారా శిక్షణ ఇస్తున్నామని అర్హతగల అభ్యర్థులను ఎంపికచేసి మూడు బ్యాచ్‌లకు 151 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ బ్యాచ్‌లో 54 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. నేర్చుకున్న వారికి వోల్వో ఆపరేటర్ గుర్తింపు సర్టిఫికెట్స్ అందిస్తామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గండ్ర దామోదర్‌రావు, సీఎంవోఏఐ అధ్యక్షుడు సానగోటి శ్రీనివాసు, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్.లక్ష్మినారాయణ, టీటీసీ డీవైజీఎం వెంకటరమణ తదదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి కృషి అభినందనీయం

సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి కృషిఅభినందనీయమని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. బుధవారం ఉత్తమ అధికారిగా ఎంపికైన వీరారెడ్డిని జీఎం గజమాలతో సన్మానించి మాట్లాడారు. సింగరేణి ఆస్తులను కాపాడారని, జీడీకే–5 ఓసీపీ ప్రారంభం సమయంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. అంకిత భావంతో పని చేసి సింగరేణిలో ఉత్తమ అధికారిగా ఎంపికవడం గొప్ప విషయన్నారు. కారక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, ఏజీఎం ఫైనాన్స్ రామకృష్ణ, ఐఈడీ ఏజీఎం అంజనేయులు, డీజీఎం పర్సనల్ లక్ష్మినారాయణ, సివిల్ డీజీఎం నవీన్, డీవైసీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

పెద్దపల్లిరూరల్: వ్యాపారులు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు. మంథని మండలం కాకర్లపల్లికి చెందిన రైతు నుంచి పత్తికొనుగోలు చేసిన కమాన్‌పూర్ మండలం గొల్లపల్లి జిన్నింగ్‌మిల్లు యజమాని.. మార్కెట్‌లో చెప్పిన ధర కంటే క్వింటాల్‌కు రూ.400 తగ్గించి ఇస్తానని మోసగించాడని పేర్కొన్నారు. సదరు రైతు వెంకన్న ఫిర్యాదు మేరకు వ్యాపారికి నోటీసు జారీ చేశామన్నారు.

ఠాణాలో ఫిర్యాదు

పెద్దపల్లి మార్కెట్‌లో కొన్న పత్తిలో మూడు సంచులను మరో వ్యాపారి తన లారీలో లోడ్ చేసుకుని తీసుకెళ్లడాన్ని మార్కెట్ అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రెండు రోజుల క్రితం జరిగిన ఈ వ్యవహారంపై పోలీసులు ఇరువురు వ్యాపారులు, అడ్తిదారులను పిలిపించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. మార్కెట్‌లో జరిగే లావాదేవీలను చర్చించుకుని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.